కథ

ప్రభా సుబ్బారావు

# ఫోనోరోజు మూగబోతే...

ఏమిటో ఏం జీవితమో! రొటీన్... రొటీన్. ఉషోదయాలు లేవు. లేస్తూనే వంటింట్లోకి దూరడం, 'ఇంకో రెండు చేతులుంటే బాగుండును' అనుకొంటూ కాళ్లకు చక్రాలున్నట్లు ఉరుకులూ, పరుగులూ. వంట మధ్యలో పిల్లలకి మేలుకొలుపులు, బుజ్జగింపులు చివరగా గదమాయింపులు. ఈలోపులో ఏదన్నా కన్పించకపోతే శ్రీవారి చిటపటలు.

పిల్లలకి లంచ్ బాక్సులు రెడీ చేసి జడలు వేసి పంపించేశాను. ఆఫీసు దగ్గరవ్వడం వల్ల లంచ్‌కి ఇంటికి వచ్చేస్తారు శ్రీవారు. ఈ రోజుకి అష్టావధానం పూర్తయినట్లే. వేడిగా కాఫీ కలుపుకొని, తీరిగ్గా తాగుతూ ఫోను పక్క సోఫాలో చేరబడి ఫోనందుకొని అమ్మకు డయల్ చేసాను. ఉరుకులూ, పరుగులతో అలసిన శరీరానికి, మనస్సుకీ అమ్మతో ఫోన్ మాట్లాడితే కొంచెం రిలీఫ్. రిసీవర్ చెవి పక్కన పెట్టుకుంటే ఏ శబ్దమూ లేదు. మళ్లీ డయల్ చేసాను. 'ఓహ్... ఫోన్ డెడ్ అయినట్లుంది' ఉసూరుమన్పించింది.

'అమ్మ ఏం కూర చేసి ఉంటుందో. పండుగకు వెళ్లినప్పుడు ఆర్డరు చేసిన గాజులు రాత్రి ఇస్తాదని చెప్పింది. అవి ఎలా తేలాయో. అయ్యో... ఈరోజే ఫోన్ డెడ్ అవ్వాలా! ఏం చెయ్యను?' పోనీ ఎస్.టి.డి. బూత్‌కి వెళ్లాలంటే స్నానమవ్వక ఇంకా నైటీలోనే ఉన్నాను. ఈ విషయంలో అటు అమ్మతోనూ, ఇటు అమ్మ అల్లుడితోనూ రోజూ చివాట్లు తింటూనే ఉంటాను. నాకేమో పనంతా అయ్యాక ఫ్రెష్‌గా స్నానం చెయ్యడం అలవాటు. ఒక అరగంట ముందు లేచి స్నానం చేసి ఫ్రెష్ అయ్యి పనులు మొదలుపెట్టొచ్చు కదా అంటారు అత్త, అల్లుడు.

ఆలోచిస్తూ బయట బాల్కనీలోకి వచ్చాను. గులాబీలు నన్ను చూసి పలకరిస్తున్నట్లు తలలూపుతున్నాయి. పని మనిషితో రోజూ చెబుతున్నాను, కుండీల్లో మట్టి చిట్లమేసుకుపోయింది, కొంచెం గుల్లచెయ్యమని. అది రేపు, రేపు అంటూ పోస్ట్‌పోన్ చేస్తుంది. నేనే చిన్న పుల్లముక్కతో మట్టిని గుల్లచేసి, ఎండిన కొమ్మల్ని కట్ చేసి, నీళ్లు పోసేసరికి కొత్త కళ వచ్చింది మొక్కలకి. వాటివైపు తృప్తిగా చూస్తూ లోపలికి వెళ్ళాను.

పొద్దుట వెళ్తూ "రమా! అరడజను షర్టులు వేసుకోడానికి పనికి రాకుండా పోయాయి. మూడు నెలల నుండి చెబుతూనే ఉన్నాను. పోనీ నీకు కుట్టడానికి తీరిక లేకపోతే కవర్‌లో పెట్టి ఉంచు. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు తీసుకు వెళ్లి టైలర్‌కిస్తాను" పొద్దుట చెప్పిన శ్రీవారి మాటలు గుర్తుకువచ్చి ఆ పని మొదలుపెట్టాను. బటన్స్ కుట్టడమే కదా. అరగంటలో కుట్టేసి కబోర్డ్‌లో సర్దేశాను.

స్నానం చేసి ఫ్రెషయ్యి పిల్లల రూమ్‌లోకి వెళ్లేసరికి గదంతా గందరగోళంగా ఉంది. బుక్స్ నీట్‌గా సర్ది, ముందురోజు ఉతికిన యూనిఫాంలు ఐరన్ చేసాను. బాబీ గులాబ్‌జామ్ చెయ్యమని అడిగాడు. స్కూలునుండి వచ్చేసరికి చెయ్యాలి అనుకొంటూ అన్నీ ఉన్నాయో లేదోనని చూసాను. అన్నీ ఉన్నాయి. ఇంకో అరగంటలో భోజనానికి వస్తారు.

పప్పుచారు వేడి చేసి టేబుల్‌మీద అన్నీ సర్దుతుంటే రానే వచ్చారు. "ఏమిటోయ్! ఈరోజు ఇల్లంతా నీట్‌గా ఉంది" వేళాకోళమాడారు.

"ఈరోజు కొంచెం సర్దానులెండి. ఇప్పుడు సర్దితే ఇంకో గంటలో పిల్లలు మాయాబజార్ చేస్తారు"

"సాయంత్రం వాళ్లు అల్లరి చేస్తారని అలాగే వదిలేస్తే ఎలా? ఇంటికి వచ్చేసరికి గందరగోళంగా ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉండదు" చెప్పాలంటే శ్రీవారు ఎప్పుడూ ఏమీ అనరు. సున్నితంగానే ఏ విషయమైనా చెబుతారు. ఇంటికి వచ్చేసరికి సర్దకపోతే ప్రశాంతంగా ఉండదన్న విషయాన్ని ఈరోజే తెలియజేసారు, అదీ నేను నీట్‌గా సర్దాక.

"ఓహ్.. అన్నం వేడిగా ఉంది. పప్పుచారు వేడిగా ఉంది. అన్నిటికీ మించి దగ్గరుండి వడ్డిస్తున్నావు. ఏమిటోయ్ ఈరోజు ఈ శుభపరిణామాలకు కారణం. మీ శైలజ ఫోన్ చెయ్యలేదా ఏమిటి? రోజూ నేను వచ్చేసరికి చెవిలో ఫోన్‌తో ప్రత్యక్షమయ్యి, చలచల్లటివి అక్కడ పెట్టేసి వెళ్లిపోతావు కదా!" సరదాగా అన్నారు.

నాకు కోపం రాలేదు. నిజమే, శైలజను లంచ్ టైమని రోజూ ఇదే టైంలో ఫోన్ చేసి కాలేజీ విషయాలు, లెక్చరర్‌గా తనను ఎట్లా ట్రీట్ చేస్తున్నారో, స్టూడెంట్స్ ఆకతాయి పనులూ ఏకరువు పెడుతుంది. తను కూడా అవన్నీ వింటూ సుధాకర్ భోజనం విషయం పట్టించుకోను. ఈరోజు అన్నీ వేడిగా ఉండడం వల్ల, దగ్గరుండి వడ్డించడం వల్ల ఒక్క ముద్ద ఎక్కువే తిన్నారు. నేనూ ఏదో కబుర్లు చెబుతూనే భోజనం చేసాను.

ఒక్క పావుగంట నుదుం వాల్చి ఆఫీసుకి వెళ్ళిపోతారు రోజూ. ఈరోజు నేనేదో మాట్లాడుతుంటే కొంచెం ఎక్కువసేపే కూర్చున్నారు. వెళ్తూ చిన్న కాంప్లిమెంట్ "ఈరోజు నువ్వు నాకు నచ్చావోయ్. ఇల్లంతా నీట్‌గా ఉంది. నువ్వూ నీట్‌గా ఉన్నావు. అన్నిటికన్నా గొప్ప విషయం నాకిష్టమైనట్టు వేడిగా భోజనం పెట్టావు"

ఉక్కిరి బిక్కిరి అయ్యాను సంతోషంతో.

శైలజతో చెప్పాలి. అది లెక్చరర్ కాబట్టి తన లీజర్ టైంలో ఫోన్ చేసి హస్కు కొడుతుంది. ఆ ఫోనుతో ఈ వాల్యూబుల్ కాంప్లిమెంట్‌కి ఇన్ని రోజులూ దూరమయ్యాను. రేపే గట్టిగా చెబుతాను. వారానికి ఒక్కసారి ఏ సాయంకాలం పూటో ఫోన్ చెయ్యమని.

బాబీకి గులాబ్‌జామ్ చేసి, స్వీటీకిష్టమని కొంచెం కారప్పూస కూడా చేసాను. ఇంకా వాళ్లు రావడానికి టైముందని ఎప్పటినుండో మూలపడి ఉన్న కుట్టుమిషన్ బయటకు లాగి ఆయిలింగ్ చేసి, స్వీటీ నైట్ డ్రెస్‌లు రిపేర్ చేసాను. అవి పూర్తయ్యేసరికి పిల్లలొచ్చారు.

వాళ్లు బాత్‌రూమ్‌కి వెళ్లి వచ్చేసరికి టేబుల్ మీద గులాబ్‌జామ్‌లు, కారప్పూస పెట్టేసరికి ఇద్దరి మొహాలు వెలిగిపోయాయి. రోజూ ఎక్కువగా బిస్కెట్లు పాలు ఇస్తుంటాను. తింటూ మధ్యలో లేచివచ్చి "మా మంచి మమ్మీ" అంటూ గట్టిగా పట్టుకొని ముద్దిచ్చాడు బాబీ. గులాబ్ జామ్ పాకం జిగురంతా నా బుగ్గని అంటుకొంది.

"వెధవా, నా బుగ్గంతా జిగురయ్యింది" మురిపంగా విసుక్కొన్నాను.

"థాంక్యూ మమ్మీ! నాకిష్టమైన కార పూస చేసినందుకు" స్వీటీ చెప్పింది తింటూ.

మధ్యాహ్నం శ్రీవారు, ఇప్పుడు పిల్లలు సంతోషంగా ఉండటానికి కారణం ఫోన్ డెడ్ అవ్వడమే.

సాయంత్రం రోజూ వాళ్లనే హోం వర్క్ చేసుకోమని, నేను ఎవరో ఒకరితో ఫోను మాట్లాడుతూ ఉంటాను. దానికి భిన్నంగా ఈరోజు "స్వీటీ, బాబీ.. తొందరగా హోమ్ వర్క్ చేస్తే పార్కుకి తీసుకువెళ్తాను" అంతే చక్కగా కుదురుగా కూర్చుని రోజు గంట చేసే హోం వర్క్‌ని అర్థగంటలో ఫినిష్ చేసేశారు.

పార్కులో వాళ్లు ఆడుకుంటుంటే, నేను కొంచెంసేపు వాకింగ్ చేస్తూ అనుకున్నాను. 'రోజూ ఈరోజు మాదిరిగా పనులు చేసుకుంటే ఏ వాకింగూ అక్కర్లేదు' పార్క్‌లో బెంచీ మీద కూర్చుని సూర్యాస్తమయాన్ని ఆస్వాదించాను.

పిల్లలకు దగ్గరుండి స్నానాలు చేయించి, కబుర్లు చెబుతూ భోజనం పెట్టాను. రోజూ మాదిరిగానే పెట్టినా, నేను దగ్గర కూర్చోవడం వల్ల శుభ్రంగా తిన్నారు. ఇదే టైంకి యు.ఎస్. నుండి చెల్లి ఫోన్ చేస్తూ ఉంటుంది. దానితో మాట్లాడుతూ హాల్లో కూర్చుండిపోతాను. దానితోనూ చెప్పాలి.

ఆడి అలిసిన శరీరాలతో పిల్లలు తొందరగా నిద్రలోకి జారుకున్నారు. సుధాకర్ రోజూ చెబుతుంటారు పిల్లల్ని తొందరగా నిద్రబుచ్చితే, ఉదయం లేవడానికి పేచీ ఉండదని. రాత్రిపూట నేను సీరియల్ చూస్తుంటే వాళ్లు కూడా అదయ్యేవరకూ పడుకోరు. చిత్రంగా ఫోనుతోపాటు టీ.వి. కూడా చూడాలన్పించలేదు ఈరోజు. మూడొంతులు మధ్యాహ్నం శ్రీవారి కాంప్లిమెంట్, సాయంకాలం పిల్లల మొహంలో తృప్తి చూసి అవ్వొచ్చు.

రాత్రి తొందరగా పడుకోవడం వల్ల, ఉదయమే ఉషోదయాన్ని చూసాను. తొందరగా లేవడం వల్ల స్నానం చేసి ఫ్రెష్ అయ్యి పనులు సాఫీగా చేసుకొన్నాను. ఫోను బాగయ్యింది.

అమ్మకు ఫోన్ చేసి "అమ్మా! నువ్వు నలుగురు పిల్లల్ని ఎలా మేనేజ్ చేసేదానివో అంటే నువ్వనేదానివి చూడు, అప్పుడు ఫోన్లు టీవీలు లేవని. అదే నిజమమ్మా" సంతోషంగా అమ్మతో నిన్న జరిగిన సంగతులన్నీ చెప్పి, చిత్రంగా గాజులు గురించి కూడా అడగడం మర్చిపోయాను.

అమ్మ ఫోన్లో అంటుంది. "ఇప్పటి మీ తరం వాళ్లకు ఎందులో ఆనందం ఉందో తెలియనీయకుండా ఈ ఫోన్లు, టీవీలు అడ్డుకుంటున్నాయి. మా అప్పుడు మీ మాదిరిగా మిక్సీలు, గ్యాస్‌లు, మైక్రో ఓవెన్‌లు లేకపోయినా ఫోన్లు, టీవీలు లేకపోవడం వల్ల పనులన్నీ తీరిగ్గా చేసుకొనేవాళ్లం. సంసారాన్ని ఒద్దికగా చక్కదిద్దుకోవడంలో ఆనందం ఒక్కరోజు ఫోన్ డెడ్ అయితేగాని తెలియలేదు నీకు.

భర్త, పిల్లలను తృప్తి పరచడం కన్నా ఫోనులో సుత్తి కబుర్లు చెప్పుకోవడం, టీవికి కళ్లప్పగించి చూడడంలో ఉండదన్న విషయం నీకు అనుభవపూర్వకంగా తెలియజేసిన టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌కు థాంక్స్ చెప్పుకోవాలి. ఇకమీదట మనం కూడా వారానికి ఒక్కసారి ఫోను చేసుకుందాం. అత్యవసరమైతే మధ్యలో మాట్లాడుకోవచ్చు" అమ్మ ఫోను పెట్టేసింది.

☆



